ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 23 | మార్చి | 2024 పేజీలు 8

# ఆదర్శనీయుడు అజరామరుడు భగత్‌సింగ్

నేడు వర్ధంతి



- అతనొక మేధావి.
- అతనొక ఆర్థికవేత్త
- అతనొక సామాజికవేత్త
- చరిత్రకారుడు, ఉద్యమకారుడు
- స్వాతంత్ర్య సమరయోధుడు
- మార్క్సిస్టు సిద్ధాంత కర్త
- విప్లవకారుడు
- అతనొక జగమెరిగిన వీరుడు
- అన్నింటికి మించి అమరుడతను
- అతడే సర్దార్ భగత్‌సింగ్

స్పెషల్ స్టోరీ సెంటర్ స్ప్రెడ్

# పలచన అవుతున్న నేతలు..!



**-పార్టీ మార్పుపై ప్రజల్లో విరక్తి**
**-అధికారం కోసం వెంపర్లాట**
**-అక్రమ ఆస్తులు, సంపాదనకోసమేనని విమర్శలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం:** ఒకప్పుడు ఏ స్థాయిలో ఉన్న నాయకుడైనా ప్రజలకు భయపడేవారు. ఏ నిర్ణయం తీసుకునే ముందైనా ప్రజలు ఎలా స్పందిస్తారు. అన్న ఆలోచన చేసేవారు. ప్రభుత్వంలో పూర్తి మెజార్టీలో ఉన్నా ప్రజల మనోభావాలను గౌరవించే వారు. ప్రజలు సైతం రాజకీయ నేతలను అదే రీతిలో గౌరవించే వారు. రాను రాను రాజకీయాలు మసక బారుతున్నాయి. 2018తెలంగాణ శాసనసభ ఎన్నికల తర్వాత ప్రజాప్రతినిధులు పార్టీ మారటం, విస్తృత చర్చకు దారి తీసింది. ఒక్కొక్కరుగా పార్టీని వీడటం అందరూ ఒకేవిధంగా లేఖలు విడుదల చేయటం అందరికీ తెలిసిందే. అభివృద్ధి మంత్రం జపిస్తూ టిడిపికు చెందిన

మిగతా 2లో..

## వైద్య ఆరోగ్య శాఖలో
# మళ్లీ డిప్యూటేషన్ల దందా..!

- గత నెల్లో రద్దు చేసిన ప్రభుత్వం
- తప్పని సరైతే జిల్లా స్థాయిలో డిప్యూటేషన్‌కు అవకాశం
- దీనిని అలుసుగా చేసుకుని అక్రమాలకు తెర
- డిఎంహెచ్‌ఓ కార్యాలయం చుట్టూ ప్రదిక్షణలు
- కలెక్టర్ వద్ద జిల్లా స్థాయి జాబితా
- ఒక్కో పోస్టుకు ఒక్కో ధర



2లో

ఒక చిన్న పదం ఇప్పుడు వైద్య ఆరోగ్యశాఖలో అక్రమాలకు తెరతీసింది. డిప్యూటేషన్లు రద్దు చేస్తూ గత నెల్లో ప్రభుత్వం ఇచ్చిన జీఓలో అత్యవసరమైతే జిల్లాస్థాయిలో డిప్యూటేషన్లు అనుమతించవచ్చు అని పేర్కొనడంతో కొందరు అత్యవసరం అనే సాకును చూపి జిల్లాలో తిష్ట వేసేందుకు డిఎంహెచ్‌ఓ కార్యాలయం చుట్టూ ప్రదిక్షనలు చేస్తున్నారు. ఈ వ్యవహారం దళారులకు కాసులు కురిపిస్తోంది. ఇప్పటికే సుమారు 40 మందికి పైగా అత్యవసర పరిస్థితిని కోరుతూ డిప్యూటేషన్‌లకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ జాబితా కలెక్టర్ ఛాంబర్‌కు చేరింది.

-ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

## చెక్‌పోస్టుల వద్ద అధికారులు
# అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ విపి గౌతమ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చెక్‌పోస్టుల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. లోక్‌సభ సాధారణ ఎన్నికల సందర్భంగా కూసుమంచి మండలం నాయకన్ గూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం కలెక్టర్ విపి గౌతమ్ తనిఖీ చేశారు. చెక్‌పోస్టు ఏర్పాట్లు, వాహనాల తనిఖీ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పటిష్ట నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. నగదు, మద్యం రవాణాను నియంత్రించాలన్నారు. పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణ, ఎన్ని వాహనాలను తనిఖీ చేసింది అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు. వాహనాల తనిఖీకి సంబంధించి రిజిస్టర్‌లో ఏ వాహనం , నెంబరు, సమయం నమోదు చేయాలన్నారు. ప్రతి చెక్‌పోస్టులో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ 24 గంటలు పటిష్ట నిఘా పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, పిఆర్‌ఎస్‌ఈ చంద్రమౌళి, ఈఈ వెంకటరెడ్డి, ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పలచన అవుతున్న నేతలు..!

**(మొదటిపేజీ తరువాయి)**

ఇద్దరు, కాంగ్రెస్‌కు చెందిన 13 మంది అప్పటి అధికార పార్టీలోకి మారి పోయారు. వారితో పాటు వివిధ హోదాలలో ఉన్న వారు, స్థానిక ప్రజా ప్రతినిధులు పోలోమని బిఆర్‌ఎస్‌లో చేరి పోయారు. సరిగ్గా ఐదేండ్ల తర్వాత సీన్ రిఫిట్ అయింది. బిఆర్‌ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీ ఎంపిలు, ఎంఎల్‌ఏలు జిల్లా స్థాయి పదవుల్లో ఉన్న వారు, కార్పోరేషన్ మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, ఎంపిపిలు, జెడ్పిటిసిలు, కాంగ్రెస్‌లో చేరిపోతున్నారు. 38 మంది శాసన సభ్యులున్న బిఆర్‌ఎస్ శాసనసభా పక్షమే కాంగ్రెస్‌లో విలీనమవుతుందన్న ప్రచారం జరుగుతుందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వచ్చే పార్లమెంటు ఎన్నికల ఒక పార్టీ తరుపున అభ్యర్థిగా ప్రకటించబడిన నాయకుడు కూడా పార్టీ మారతారని ప్రచారం జరుగుతుందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించుకోవచ్చు. ప్రజా స్వామ్యంలో పార్టీ మారే స్వేచ్ఛ అందరికి ఉంది కానీ మాటలే తీవ్ర విమర్శలకు కారణమవుతున్నాయి. ఒక రోజులో కాదు ఒక గంటలోనే మాట మార్చేస్తున్నారు. నేను పార్టీలో కొనసాగుతా అంటే వెంటనే పార్టీ మారతారని అనుకోవాల్సి వస్తుంది. తీవ్ర విమర్శలు చేసుకున్న వారు, సవాళ్లు విసురుకున్న వారు చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి వారు మంత్రిగా, శాసన సభ్యునిగా పనిచేసిన తర్వాత నాకు వ్యాపారమే ముఖ్యం పది శాతమే రాజకీయ నాయకుడిని అన్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతమవుతుంది. వ్యాపారాల కోసం, కాంట్రాక్టుల కోసం, అక్రమ సంపాదనలు, ఆస్తులు కాపాడుకోవడం కోసం రాజకీయాల్లోకి వచ్చి వ్యవస్థను భ్రష్టు పట్టించడమే గాక అధికారం లేకపోతే ఒడ్డున పడ్డ చేపల్లా గిలగిలలాడిపోతున్నారు. తమ అక్రమాలు ఎక్కడ బయటకు వస్తాయోనని వణికిపోతున్నారు. ఆ భయానికే అభివృద్ధి ముసుగు వేస్తున్నారు. పార్టీ మారగానే సచ్చీశీలురైపోతున్నారు. అక్రమాలన్ని సక్రమాలవుతున్నాయి. వీటిని చూసి ప్రజలు విసిగిపోతున్నారు. రాజకీయ నాయకుల ప్రకటనలకు విలువ లేకుండా పోయింది. అయినా ఇవేవి కొందరి నేతలకు పట్టడం లేదు. నవ్వి పోదురు గాక నాకేంటి సిగ్గు అంటూ జెండాలు మార్చే పనిలో పడ్డారు.

# వైద్య ఆరోగ్య శాఖలో మళ్లీ డిప్యూటేషన్ల దందా..!

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అక్రమాలు జోరుగా సాగుతున్నాయి. గత నెల 7వ తేదిన శాఖలోని అని డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో జిల్లాలో డిప్యుటేషన్‌పై ఉన్న సుమారు 85 మంది తమ స్వంతస్థానాలకు వెళ్లిపోయారు. కాగా ఇచ్చిన ఆ ఉత్తర్వుల్లో అత్యవసరమైతే డిప్యుటేషన్లు జిల్లా స్థాయి వరకు చేసుకోవచ్చు అని పేర్కొన్నారు. దీంతో అత్యవసరం అనే పదాన్ని వై.ఆ.శాఖలోని కొందరు తమకు నచ్చినట్లు వాడుకుంటున్నారు. దీనిని కొందరు అధికారులు దుర్వినియోగం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇష్టాను సారంగా డిప్యుటేషన్లకు అనుమతులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా చేసుకున్న కొందరు దళారాలు పోస్టుకో రేటు కట్టి పైరవీలు మొదలుపెట్టారు. ఇది వైద్య ఆరోగ్య శాఖలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

**సొంత స్థానాలకు 85 మంది...**

చాలా సం.లుగా డిప్యుటేషన్ల పేరుతో పాతుకుపోయిన సిబ్బందిని తమ సొంత స్థానాలకు పంపేందుకు ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేసింది. దీంతో 85 మంది రిలీవ్ అయ్యారు. పొరుగున ఉన్న ములుగు, భూపాపలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం నుండి డిప్యుటేషన్లపై వచ్చారు. కాగా ప్రభుత్వం డిప్యుటేషన్లతో పాటు వర్క్ ఆర్డర్ విధానాన్ని సైతం రద్దు చేయడంతో ఆస్పత్రులు సిబ్బందితో నిండుకున్నాయి. ఈ జిల్లా నుండి డిప్యుటీ జిల్లా మెడికల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, సిహెచ్‌ఓ, ఎల్‌టిలు, ఏఎన్‌ఎంలు, పబ్లిక్ హెల్త్ నర్సులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సూపర్ వైజర్లు, స్టాఫ్ నర్సులు, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు రిలీవ్ అయ్యారు.

**వారికి నచ్చినట్లుగా...**

ప్రభుత్వం డిప్యుటేషన్లు రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఉన్న ఒక చిన్న పదం ఇప్పుడు తంటాతెచ్చిపెట్టింది. దీనిని ఎవరికి నచ్చినట్లుగా వారు ఆపాదించుకుని మళ్లీ అక్రమ డిప్యుటేషన్లకు తెరలేపారు. కలెక్టర్ అనుమతితో అత్యవసరమైతే డివ్యుటేషన్లు ఇచ్చే అవకాశాన్ని డిఎంహెచ్‌ఓలకు ఇవ్వడంతో దందా మొదలైంది. ఇప్పటికే సుమారు 40 మందికి పైగా ఆ చిన్న పదాన్ని వాడుకుని డివ్యుటేషన్లు కోసం సిద్ధమయ్యారు.



వీరిలో ప్రోగ్రాం ఆఫీసర్లు, డిప్యుటీ సిహెచ్‌ఓ, హెచ్‌ఇఓలు, హెల్త్ సూపర్వైజర్లు ఉన్నారు. వీరి జాబితా డిఎంహెచ్‌ఓ కార్యాలయం నుండి ఆమోదం కోసం కలెక్టర్ ఛాంబర్‌కు చేరుకుంది. మరో ప్రక్క కలెక్టర్ ఆదేశాలు లేకుండా కూడా కేవలం మౌఖికంగా తెలియజేసి డిప్యుటేషన్లు ఇస్తున్నట్లు సైతం ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారం వైద్య ఆరోగ్యశాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.

**ఒక్కో పోస్టుకు ఒక్కో ధర...**

వైద్య ఆరోగ్యశాఖలో సాగుతున్న అక్రమ డిప్యుటేషన్లు దళారులకు కాసులు కురిపిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోస్టును బట్టి దళారులు రేటు కడుతున్నట్లు తెలుస్తోంది. మండలం నుండి జిల్లా కేంద్రానికి వెళ్లడానికి చాలా మంది ఆసక్తి ఉండటంతో దళారుల పంట పండుతున్నట్లు సమాచారం. గెజిటెడ్ పోస్టుకు రూ.3 లక్షల వరకు, నాన్‌గెజిటెడ్ పోస్టుకు రూ.1 లక్ష నుండి రూ.2 లక్షల వరకు పలుకుతున్నట్లు వినికిడి. ప్రభుత్వం రద్దు చేసిన డిప్యుటేషన్లు అత్యవసరం పేరిట మళ్లీ మొదలు కావడం, లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

**- ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** పకడ్బందీగా ఎన్నికల కోడ్‌ను నిర్వహిస్తూ చెక్‌పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం రాత్రి తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడ్‌క్రాస్‌రోడ్‌వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తిరుమలాయపాలెం మండలానికి వరంగల్,మహబూబాద్,నల్గొండ జిల్లాలు అతి దగ్గరగా ఉండటంతో అంతర్ జిల్లాలను దాటి ఖమ్మం జిల్లాకు ఇటు వైపు నుంచే వాహనాలు రవాణసాగిస్తాయన్నారు. ఈ క్రమంలో రహస్యంగా అక్రమ నగదు,మద్యంతో పాటు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు పలు వస్తువుతలను పెద్ద మొత్తంలో తరలించేందుకు వీలు ఉంటుందన్నారు. కాబట్టి ఎలాంటి బిల్లులు,రసీదులు లేకుండా వాహనాల్లో నగదుతో పాటు వస్తువులను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి సబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలన్నారు.



ప్రతి ఒక్క వాహనదారుడు ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ తనిఖీలలో ఎస్‌ఐ గిరిధర్‌రెడ్డి, అర్‌అండ్‌బీ ఏఈ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

## ఇజ్రాయిల్ దాడులను ఆపాలి

**సిపిఐ నేత సలాం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పాలస్తీనా పై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. ఒక పథకం ప్రకారం పాలస్తీనా ఆక్రమణ కోసం, అక్కడి సంపదను దోచుకోవడం కోసం ఇజ్రాయిల్ ప్రయత్నిస్తుందన్నారు. పాలస్తీనాపై దాడులకు నిరసనగా వాయిదియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ కేవలం ఇజ్రాయిల్ నుంచి శరణార్థులుగా వచ్చి పాలస్తీనాను ఆక్రమించాలని ప్రయత్నించడాన్ని యావత్ ప్రపంచం ఖండిస్తున్న దాడులు ఆపకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె గౌస్, ఎండి రెహ్మాన్, ఎస్‌డి ఆసిఫ్, ఎస్‌డి ఫసీ, ఎంఎ అజీజ్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపు చేయండి

**- భూగర్భ జలాలు పెంచండి -ప్రకృతి ప్రేమికుడు వెంకట్రామిరెడ్డి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భూ మండలంలోని సమస్త జీవులకు గాలి, నీరు, ఆహారం ముఖ్యమని ఈ అవసరాలను విస్మరించి ప్రవర్తిస్తే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ప్రకృతి ప్రేమికుడు కుడుముల వెంకట్రామిరెడ్డి తెలిపారు. ప్రపంచ జల దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనముంటే ఏదైనా కొనగలమన్న ధీమాలో కొందరు ఉన్నారని అది మానవ వినాశనానికి దారితీస్తుందన్నారు. గాలి, నీరు, భూమి, అగ్ని, ఆకాశం పంచభూతాలను అందుకే పూర్వీకులు వీటిని పూజించేవారని ఆయన తెలిపారు. నదులు, చెరువుల్లో ఎక్కడ పడితే అక్కడ నీటిని చూసిన మనం ఇప్పుడు వాటర్ బాటిల్‌లో చూస్తున్నామని సైన్స్ ఎంతగా అభివృద్ధి చెందిందో అంతగా ప్రకృతి ఇబ్బందికర పరిస్థితులకు నెట్టివేయబడుతుందన్నారు. భూమికి వివధ రకాల రసాయన మందులను వాడడం వల్ల భూమిలోని నీరు కలుషితమైందని తద్వారా దాని పర్యవసానం పంటలపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు మానవ ఆరోగ్యాలను దెబ్బతీస్తుందన్నారు. గతంలో కుంటల్లో నీరు నిల్వ చేసుకుని భూమిలోకి ఇంకిపోయి భూగర్బ జలాలు పెరిగి కలుషితం కాని నీరు లభించేదని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వెంకట్రామిరెడ్డి తెలిపారు. వర్షం పడిన సమయంలో నీటిని ఒడిసిపట్టడంలో మన పూర్వీకులు ముందు వరుసలో నిలిచారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. భూ గర్బ జలాలు రోజు రోజుకు ఇంకిపోతున్నాయని భూ గర్బ జలాలు ఇంకిపోవడమంటే ప్రమాద ఘంటికలు మ్రోగుతున్నాయని భావించాలన్నారు. ఇప్పటికైనా ఇటు ప్రభుత్వం అటు ప్రజలు జల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

## గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల నుండి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు తరలిపోతున్న గంజాయిని భద్రాచలం చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. బొలేరో వాహనంలో సుమారు 32 ప్యాకెట్ల గంజాయిని తరలిస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 66 కేజీల గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు 17 లక్షల వరకు ఉండవచ్చని అంచన, గంజాయితో పాటు బొలేరో వాహనాన్ని పోలీసులు స్వాదీనం చేసుకుని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఎన్నికల నేపథ్యంలో భద్రాచలం సరిహద్దు ప్రాంతాల్లో నాలుగు వైపులా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు ప్రతీ రోజూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలు కొనసాగుతున్నప్పటికీ గంజాయి అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

## సిసి కెమోరాలకు విరాళం




**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని ఇండస్ట్రీయల్ ఏరియా వ్యాపారులు సిసి కెమోరాల నిమిత్తం రూ.1 లక్ష రూపాయల విరాళాన్ని పట్టణ ట్రాఫిక్ పోలీసులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వాతాడి దుర్గారావు మాట్లాడుతూ అందించిన మొత్తంతో సిసి కెమోరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ మధు ప్రసాద్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ఈ మొత్తంలో సిసి కెమోరాలు కొనుగోలు చేసి పట్టణంలో ఏర్పాటు చేస్తామని, నేరాల నివారణకు సిసి కెమోరాల ఫుటేజీలు చాలా అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రీయల్ వ్యాపారాలు, వర్కర్లు తదితరతులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో
# మౌలిక వసతులు కల్పించాలి



కలెక్టర్ విపి గౌతమ్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతుల కల్పన చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ విపి గౌతమ్ కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఈశ్వరమాధారం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల, రాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పెరికసింగారం, మండల ప్రాథమిక పాఠశాల, జుజ్జులరావు పేట, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల తదితర అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసరం ఉన్న చోట రంగులు వేయాలని, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ ఉండాలన్నారు. ఫ్యాన్లు, లైట్లు సరిపోను ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భద్రతాపరంగా చర్యలు తీసుకోవాలని, కాంపౌండ్ వాల్ లేని పోలింగ్ కేంద్రాలకు కాంపౌండ్ వాల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. స్వీప్ కార్యచరణలో భాగంగా కాంపౌండ్ గోడలపై ఓటరు అవగాహనకు సంబంధించి నినాదాలు రాయాలన్నారు. భద్రతాపరంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల విధుల సిబ్బంది వసతికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజలకు పాఠశాలను చూడగానే ఇక్కడ పోలింగ్ కేంద్రం ఉన్నదనే ప్రత్యేకత కనిపించాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, పిఆర్ఎస్ఈ చంద్రమౌళి, ఈఈ వెంకటరెడ్డి, ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి





కలెక్టర్ విపి గౌతమ్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పల్లె దవాఖానాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ విపి గౌతమ్ కూసుమంచి మండలం జుజ్జులరావు పేట గ్రామంలోని పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. షుగర్, బిపి వ్యాధి గ్రస్తులకు ప్రతి నెల మందులు ఇవ్వాలన్నారు. పాము, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈడిడి చార్ట్ ప్రదర్శించాలన్నారు. గర్భిణీలకు అవసరమైన పరీక్షలు సమయానుసారం చేయించాలని కలెక్టర్ తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, పిఆర్ఎస్ఈ చంద్రమౌళి, ఈఈ వెంకటరెడ్డి, ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

# ఎడ్వేదాకు 59 మంది ఎస్‌బిఐటి విద్యార్థులు ఎంపిక



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రముఖ బహుళజాతి కంపెనీ ఎడ్వేదాకు ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన 59 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. వివిధ దశలలో నిర్వహించిన ఈ నియమాక ప్రక్రియలో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారని ఆయన తెలిపారు. ఐసిటి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో మొత్తం 276 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 123 మంది విద్యార్థులు గ్రూప్ డిస్కషన్ లో అర్హత సాధించారన్నారు. తదుపరి మౌఖిక పరీక్షల్లో 59 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే 297 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ఇది తమకెంతో గర్వకారణమన్నారు. ప్రముఖ ఈ లెర్నింగ్ కంపెనీ ఎడ్వేదా భారతీయ సాంకేతిక మండలి ఏఐసిటిఇ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐసిటి అకాడమీ సహకారంతో తమ కళాశాలలో ఉద్యోగ నియమాకాలు నిర్వహించడం తమకు సదావకాశమని ప్రిన్సిపల్ రాజ్ కుమార్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ. 4.5 లక్షల నుండి రూ. 7.5 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ బి. రాజేశ్వరి, సిఎవో రాంకుమార్, టీమ్ లీడర్ అక్షయ, అన్వర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ అమిత్‌బిందాజ్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జి. ప్రవీణ్‌కుమార్, జే. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, టిపివో సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం బోనకల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. శుక్రవారం మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకులు మందడపు మనోహర్ రావు నూతనంగా నిర్మించిన ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఈ ఫంక్షన్ హాల్ అధునాతన సౌకర్యాలతో నిర్మించిన ఈ ఫంక్షన్ హాల్‌ను ఖమ్మం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మందడపు లక్ష్మి, మందడపు బ్రహ్మారెడ్డి,పాలెపు వెంకటరమణ,మిక్కిలినేని నరేంద్రపాల్గొన్నారు.

# మంత్రి తుమ్మల వాహనం తనిఖీ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాహనాన్ని పోలీస్ అధికారులు తనిఖీ చేశారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మధిర చెక్‌పోస్టు వద్ద అటుగా వెళ్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూర్తి సహకార మందించారు.

# నెంబరు ప్లేట్లు లేని వాహనాలపై కేసులు నమోదు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నెంబరు ప్లేట్లు లేకుండా, లెటర్స్‌ను తొలగించి నగరంలో తిరుగుతున్న 13 ద్విచక్ర వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు నగరంలో నిబంధనలను అతిక్రమించి రోడ్లపై నడుపుతున్న వాహనాలపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు కూడళ్లలో నిర్వహించిన తనిఖీల్లో నెంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసి వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్‌లకు తరలించినట్లు ఏసిపి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వారు చలానాల నుంచి తప్పించుకోవడంతో పాటు ట్రాఫిక్ పోలీసులు గుర్తించకుండా ఉండేందుకు నెంబరు ప్లేట్లు లేకుండా, అక్షరాలను తొలగిస్తూ స్టిక్కర్స్, మాస్కులు వేస్తున్నారని తెలిపారు. కొన్ని నెంబరు ప్లేట్లను బెండు చేస్తున్నారని ఏసిపి తెలిపారు. ఇటువంటి వాహనదారులు ఇష్టం వచ్చినట్లుగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని, చైన్ స్నాచర్లు నేరాలు చేస్తూ నెంబరు లేని బైకులపై తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నెంబరు ప్లేట్లు లేకుండా, వింత శబ్దాలు వంటి వాహనాలు కలిగిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయనున్నట్లు ట్రాఫిక్ ఏసిపి తెలిపారు.

# కరుణగిరి పుణ్యక్షేత్రానికి సిలువ యాత్ర



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామం నుంచి ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి పుణ్యక్షేత్రం వరకు సిలువ యాత్రను నిర్వహించారు. శుక్రవారం ఫాదర్ సురేష్ ఆధ్వర్యంలో 25 కిలో మీటర్ల మేర సిలువ యాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో బూడిదంపాడు, మంచుకొండ, పండితాపురం, సోతానిగూడెం కు చెందిన సుమారు 700 మందికి పైగా క్రిస్టియన్ సోదరులు పాల్గొన్నారు. ఈ యాత్రలో ఏసుక్రీస్తు కీర్తనలు పాడుతూ ప్రార్థనలు చేశారు.

## ఎన్‌ఆర్‌ఐల సమస్యల పరిష్కారానికి కృషి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇతర దేశాలలో ఉంటున్న వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్‌సి తాతా మధుసూదన్ తెలిపారు. శుక్రవారం ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. జిల్లా కమిటీ అధ్యక్షులు ఎన్. స్వరూప రాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రెండేళ్ల కాలంలో అసోసియేషన్ చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాన కార్యదర్శి, ఎంఎల్‌సి తాతా మధు మాట్లాడుతూ అసోసియేషన్ యొక్క ఆవశ్యకత, ఇతర దేశాలలో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రస్తుత పరిస్థితులను వివరించారు. రాబోయే రోజుల్లో అసోసియేషన్ ద్వారా పూర్తి స్థాయి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఇతర దేశాలలో ఉన్న పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకరాలను అందిస్తానన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నివేదికను ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు బత్తిని నీరజ, ఉపాధ్యక్షులు వై. శ్రీనివాసరావు, దుగ్గి లక్ష్మి, రాయల రవికుమార్, నెల్లూరి వీర బాబు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన జెడ్పి చైర్మన్



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలం రావినూతల గ్రామంలో శుక్రవారం జరుగుతున్న తుడుం మంగయ్య కుమార్తె వివాహ వేడుకలకు జెడ్పి చైర్మన్ లింగాల కమల్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జునరావు, మాజీ జెడ్పిటిసి బాణోత్ కొండ, మాజీ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్, వేమూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జెడ్పి సిఇఓ



**ప్రజాపక్షం/ చింతకాని :** మండల పరిధిలోని పందిళ్ళపల్లి , నాగులవంచ రైల్వే కాలనీ,నర్సింహాపురం, రేపల్లెవాడ పోలింగ్ కేంద్రాలను జిల్లా పరిషత్ సిఇఓ వినోద్ శుక్రవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, సి డీజిల్‌పై అవగాహన వంటి కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బిఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రమేష్, ఎంపిడిఓ రామయ్య, ఎంపిఓ మల్లెల రవీంద్రబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఓటే వజ్రాయుధం




**ప్రజాపక్షం/ చింతకాని :** ఓటు హక్కు వజ్రాయుధమని జిల్లా పరిషత్ సిఇఓ వినోద్ పేర్కొన్నారు. శుక్రవారం చింతకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగంపై నెహ్రూ యువజన కేంద్రం, నేతాజీ యోజన కేంద్రం ఆధ్వర్యంలో ఓటర్లకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రమేష్, ఎంపిడిఓ రామయ్య, ఎస్సై నాగుల్‌మీరా, పంచాయతీ కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# కేజ్రీవాల్ అరెస్టు మోడీ ఓటమికి నాంది




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ అధ్యక్షులు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టు మోడీ ఓటమికి నాందిగా వివిధ రాజకీయ పక్షాల నేతలు ధ్వజమెతారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఆప్ జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇండియా కూటమి, వివిధ రాజకీయపక్షాల నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి కేజ్రీవాల్ అరెస్టును నిరసించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజల తరుపున పనిచేసే ముఖ్యమంత్రులను అరెస్టు చేయించి భయోత్పతంతో పార్లమెంటు ఎన్నికల్లో నెగ్గాలని ఫాసిస్టు ఆలోచనతో మోడీ ఉన్నారన్నారు. బిజెపి ఎన్నికల పరాభవాన్ని భరించలేకే కేజ్రీవాల్ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం మోడీ అబద్ధాల ఫ్యాక్టరీలో ఉత్తుత్తి కట్ట కథే అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా మోడీ అవినీతి బురద బయటపడడంతో దానిని మభ్యపెట్టేందుకు ప్రతి పక్ష నేతల పై దాడులు, అరెస్టులు చేయిస్తున్నారన్నారు. రాజ్యాంగ సంస్థను తమ జేబు సంస్థలుగా బిజెపి మల్చుకుని ప్రతిపక్షాలప దాడులు చేయిస్తుందన్నరు. మత చాందస వాది మోడీ మరల అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం అనే మాటకే అర్థం ఉండదన్నారు. కేజ్రీవాల్ అరెస్టు కాంగ్రెస్ బ్యాంకు అకౌంట్ సీజ్ చేయడం చూస్తుంటే బిజెపి, మోడీ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందన్నారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బిజెపి దేశాన్ని సర్వ నాశనం చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు నల్ల మోతు తిరుమలరావు, సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, టిజెఎస్ నగర అధ్యక్షులు జంగిపల్లి రవి, ఎన్‌డినాయకులు ఎస్‌కె ఖాసీం, ఆప్ జిల్లా అధ్యక్షులు పసుమర్తి శ్రీనివాస్, సిద్దల రాంబాబు, సిపిఐ, సిపిఎం నాయకులు తాటి వెంకటేశ్వర్లు, విక్రం, పివోడబ్ల్యూ నాయకురాలు ఝాన్సీ, సివై పుల్లయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళను గౌరవించాలి



షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ కౌన్సిలింగ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమాజంలో ప్రతి మహిళను గౌరవించాలని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ గీత చల్లా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలను వేధించిన బాధ్యులను గుర్తించి వారికి రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ప్రధాన కార్యాలయం (షీ టీమ్స్) నుంచి ఆన్‌లైన్ కౌన్సిలింగ్ శుక్రవారం నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ గీత చల్లా పాల్గొని బాధ్యులతో కొన్ని ప్రయోగాత్మక విధానాలను అవలంభిస్తూ తప్పులు తెలుసుకుని వారిలో మార్పు వచ్చేలా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్పు బాధ్యుల నుండే మొదలు కావాలని హితవు పలికారు. తప్పులు చేసే బాధ్యుల్లో మార్పు తీసుకొచ్చేందుకే ఈ ఆన్‌లైన్ కౌన్సిలింగ్ చేపట్టామన్నారు. బాధ్యులు చేసే తప్పిదాలు రేపు మీ కుటుంబంలోని మహిళకు కూడా జరిగే అవకాశం ఉంటుందని గుర్తెరగాలన్నారు. బాధ్యుల తల్లిదండ్రులు కూడా ఈ కౌన్సిలింగ్‌లో పలు సూచనలు చేశారు. పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని బాధ్యుల్లో మార్పుకు కొన్ని సూత్రాలు తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌లో ఖమ్మం నుండి సిఐ అంజలి, షీ టీమ్ బృందం పాల్గొన్నారు.

# వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న మోడీ

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రధాని మోడీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఖమ్మంజిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్ తెలిపారు. ఖమ్మంజిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పాత బస్టాండ్ ఎదురుగా ప్రధాని నరేంద్ర మోడీ బొమ్మలకు నిప్పంటించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ నరేంద్ర మోడీ ఓటమి భయంతోనే ప్రజాస్వామ్య వ్యవస్థలను అడ్డుపెట్టుకుని అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్ బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేసి అందులో గల రూ. 135 కోట్లను ఇన్‌కం టాక్స్ పేరుతో దోచేశారన్నారు. లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు రూపాయి రూపాయి పార్టీకి డోనేషన్ రూపంలో ఇస్తే ఆ డబ్బులు ఇన్‌కం ట్యాక్స్ పేరుతో నరేంద్ర మోడీ కొట్టేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే సీజ్ చేసిన కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను రిలీజ్ చేసి రూ. 135 కోట్లను డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐ ఖాతాలను కూడా సీ జ్ చేయడం మోడీ సిగ్గుమాలిన పరిపాలనకు నిదర్శ నమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకలు బోడేపూడి రాజా, కొండూరు ఉదయ్‌కిరణ్, బొల్లం మహేష్ యాదవ్, తోమాటి నవీన్‌రెడ్డి, అశోక్, మాలోత్ హుస్సేన్, మహ్మద్ ఫకృద్దీన్, బానోత్ సైదేశ్వరరావు, అన్వేష్, బాలగంగాధర్, రాజీవ్ గాంధీ, శ్రీకాంత్, బాలు, రమణ, సాయికిరణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఆదర్శనీయుడు అజరామరుడు భగత్‌సింగ్



## మేరా ‘భగత్’ మహాన్ హై

**ముగ్గురు రాజకీయ ఖైదీలను ఉరి తీయడానికి ఉరి కంబాల వైపుకు తీసుకెళ్తున్నారు. కొద్ది నిమిషాల్లో వారి ప్రాణాలు గాలిలో కలిసిపోనున్నాయి. ఆ సమయంలో ఉరి కంభం వైపు నడుస్తూ ముగ్గురిలో ఓ యువకుడు ప్రాణం పోయినా నా మనస్సులో దేశంపై ప్రేమ చావదు. మట్టిలో కలిసినా నా శరీరం నుంచి ఈ దేశపు పరిమళమే వస్తుంది అంటూ పాడుతుండగా పక్కన ఉన్న ఇద్దరు ఆయనతో స్వరం కలిపారు. ఆ పాడిన వ్యక్తే నూనూగు మీసాల ప్రాయంలోనే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భగత్‌సింగ్ ఆయనతో శృతికలిపిన వారు రాజ్‌గురు, సుఖ్‌దేవ్. ఉరి తాడును మెడలో వేసుకుని ముద్దాడిన ధీరోదాత్తుడు.**

ముగ్గురు రాజకీయ ఖైదీలను ఉరి తీయడానికి ఉరి కంబాల వైపుకు తీసుకెళ్తున్నారు. కొద్ది నిమిషాల్లో వారి ప్రాణాలు గాలిలో కలిసిపోనున్నాయి. ఆ సమయంలో ఉరి కంభం వైపు నడుస్తూ ముగ్గురిలో ఓ యువకుడు ప్రాణం పోయినా నా మనస్సులో దేశంపై ప్రేమ చావదు. మట్టిలో కలిసినా నా శరీరం నుంచి ఈ దేశపు పరిమళమే వస్తుంది అంటూ పాడుతుండగా పక్కన ఉన్న ఇద్దరు ఆయనతో స్వరం కలిపారు. ఆ పాడిన వ్యక్తే నూనూగు మీసాల ప్రాయంలోనే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భగత్‌సింగ్ ఆయనతో శృతికలిపిన వారు రాజ్‌గురు, సుఖ్‌దేవ్. ఉరి తాడును మెడలో వేసుకుని ముద్దాడిన ధీరోదాత్తుడు.



ఈ యోధుని పేరు వింటే సామాజిక అవగాహన, దేశ భక్తి ఉన్న ప్రతి ఒక్కరిలోను రోమాలు నిక్కరపోడుచుకుంటాయి. బ్రిటిష్ అధికారులు సైతం తమకు తెలియకుండానే ఆయనకు సెల్యూట్ చేశారంటే ఆ వీరుని గొప్పతనం తెలుస్తుంది. చిరుప్రాయంలోనే బ్రిటిష్ ముష్కరుల అరాచకాలను చూసి తాతా పొలంలో ధాన్యపు గింజలే ఎందుకు పండుతాయి. తుపాకి గుండ్లు పండవా అని ప్రశ్నించిన ధైర్యశాలి భగత్‌సింగ్. 23 ఏళ్లకే తన బలిదానంతో యావత్ దేశ నలుమూలల యువతలో దేశభక్తి జ్వాలను రగిలించాడు. ఆయన ధైర్యానికి ఓ ప్రతీక. దేశభక్తికి ప్రతిరూపం. లక్ష్యం లేని గమ్యం వైపు పయనిస్తున్న యువతకు ఆయన మార్గం ఓ లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. సిద్ధాంతం లేని జీవితానికి ఓ సిద్ధాంతాన్ని వర్తింపజేస్తుంది. భగత్ సింగ్ పేరు కొత్త శక్తిని ఇస్తుంది. అందుకే ఆయన మహానీయుడు. 1907 సెప్టెంబరు 28న నేటి పాకిస్తాన్‌లోని బంగాలో కిషన్‌సింగ్, విద్యావతి దంపతులకు భగత్‌సింగ్ జన్మించాడు. చిన్నప్పటి నుంచే దేశభక్తిని పెంపొందించుకున్నాడు. బ్రిటిష్ ముష్కరులను ఈ దేశం నుంచి పారద్రోలాలని నిర్ణయించుకున్నాడు. తన జీవితాన్ని దేశానికి అంకితం చేశాడు. 14 ఏళ్ల ప్రాయంలోనే సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. గాంధీజీ



సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిలుపుదల చేయడాన్ని భగత్‌సింగ్ వ్యతిరేకించాడు. ఆనాటి గాంధీ నిర్ణయం భగత్‌సింగ్‌కు నచ్చలేదు. అందుకే ఒక కొత్త పంథాను ఎంచుకున్నాడు. ఆ ఆలోచనకు రూపమే భారత్ సభ. భారత్ సభ పేరుతో ఒక మిలిటెంట్ సంఘాన్ని ఏర్పరిచారు. ఆ తర్వాత హిందుస్థాన్ రిపబ్లిక్ ఆర్మీ పేరుతో సంస్థను ప్రారంభించి తనదైన పద్ధతిలో పోరాటాన్ని కొనసాగించిన ధీరుడు భగత్‌సింగ్. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఆందోళన జరిగినప్పుడు పోలీస్ దాడిలో లాలాలజపతిరాయ్ చనిపోవడంతో భగత్ సింగ్ కోపోద్రిక్తుడయ్యాడు. ఆయన నెత్తురు ఉడికింది. లాలాలజపతిరాయ్ మరణానికి ప్రతీకారంగా జాతీయ అసెంబ్లీలో తన సహచరులతో కలిసి బాంబులు వేయాలని వ్యూహం పన్నాడు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ కరపత్రాలు వెదజల్లాడు.

1928 ఏప్రిల్ ఎనిమిదిన జాతీయ అసెంబ్లీపై బాంబు దాడి జరిగింది. యావత్ దేశం అట్టుడికిపోయింది. భగత్‌సింగ్ లొంగిపోయి కోర్టులో తాను నమ్మిన సిద్ధాంతం సరైంది అంటూ కోర్టు గోడలు ప్రతిధ్వనించేలా తన వాదనను వినిపించాడు. బ్రిటిష్ ప్రభుత్వం అతన్ని జైలుకు తరలించింది. జైలులో సైతం సౌకర్యాల కోసం ఆందోళన చేపట్టాడు. అప్పుడే నేను ఎందుకు నాస్తికుడినయ్యాను అని ఓ వ్యాసం రాశాడు. విప్లవ వారసత్వ విలునామా తదితర పుస్తకాలను రచించాడు.

### 1931 మార్చి 23...

బ్రిటిష్ ప్రభుత్వం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరి తీయాలని నిర్ణయించింది. లాహోర్ జైలులో సాయంత్రం 7.33 గంటలకు ఉరి తీస్తారనగా అలా ఉరి కంభం వైపు నడుచుకుంటూ భగత్‌సింగ్ పైన పేర్కొన్న పాటను పాడాడు. నిజమే ఆయన పాడిన పాట అక్షరమైంది. 93 సంవత్సరాల క్రితం ఆయన పాడిన పాట మననం చేసుకుంటున్నామంటే భగత్‌సింగ్ ప్రభావం దేశంపై ఎంతగా ప్రభావం చూపిందో అవగతమవుతుంది. నిజమే ఆయన ప్రాణం పోయినా ఈ దేశం పై ఆయన ప్రేమ చావలేదు. లక్షల కోట్ల మంది దేశభక్తులను తయారు చేసింది. ఆయన శరీరం ఈ భూమిలో కలిసిపోయినా ఈ దేశభక్తి పరిమిలాలను వెదజల్లుతూ ఎందరో మరెందరో దేశ భక్తులను తయారు చేసింది అందుకే మేరా భగత్ మహాన్ హై.

### యువతకు ఆదర్శం...



సమకాలిన ప్రపంచంలో ఏ దేశానికి లేని ఓ గొప్పతనం భారతదేశానికి ఉంది. భారతదేశ జనాభాలో సగం మంది యువకులే. యువ రక్తంతో భారతదేశం తొణికిసలాడుతుంది. కానీ అచేతనంగా యువత పడి ఉన్నది. మద్యం మత్తులోనో, కంప్యూటర్ కిక్కులోనో, ఊహాజనిత ప్రపంచంలోనో యువత జీవిస్తుంది. తమ పక్కన ఏమి జరుగుతుందో పట్టించుకోలేని అర్థ అంధకారంలో ఉంది. భగత్‌సింగ్ లాంటి మహానీయుని వర్ధంతి సందర్భంగా యువత మేల్కొవాల్సి ఉంది. ఒకపక్క మతోన్మాదం, మరో పక్క పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, ఆకలి చావులు, బలత్కారాలు, చిత్కారాలు ఈ దేశం పాలిట శాపాలుగా మారాయి. పరాయి పీడనను పారద్రోలిన స్వదేశ పీడన వివిధ రూపాలలో సామాన్యులను బలిగొంటుంది. యువత వీటిపై ఆలోచన చేయాల్సి ఉంది. యుక్త వయస్సులో సమాజం గురించి ఆలోచించలేని వానిలో ఏదో ఓ లోపం ఉంటుందన్న ఓ మహానీయుని మాటలను స్ఫురణకు తెచ్చుకుందాం. ఈ దేశం కోసం, ఈ సమాజం కోసం ఈ సమాజంలోని ఆదో జగత్ సహోదరుల కోసం ఎంతో కొంత పాటుపడదాం. అదే భగత్‌సింగ్‌కు మనమిచ్చే నివాళి.

-ఏనుగు వెంకటేశ్వరరావు /ప్రజాపక్షం

# మోకాళ్ల శస్త్ర చికిత్సల్లో అపోహలొద్దు




**-రోబోటిక్స్ సర్జరీ ఎంతో మేలు**
**-విలేకరుల సమావేశంలో డాక్టర్ సునీల్ దాచేపల్లి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మోకాళ్ల శస్త్ర చికిత్సల్లో ప్రజలు ఎటువంటి అపోహలు చెందవద్దని రోబోటిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్, కీహోల్ ఆర్థోపెడిక్, యశోద ఆసుపత్రి వైద్యులు సునీల్ దాచేపల్లి తెలిపారు. యశోద ఆసుపత్రి సోమాజిగూడ ఆధ్వర్యంలో ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యులు సునీల్ దాచేపల్లి మాట్లాడుతూ మోకాళ్లు అరిగిపోతే ఆపరేషన్ చేస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదని ప్రజల్లో ఉన్న అపోహలు పోవాలని తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. మోకాళ్ల అరుగుదలకు సంబంధించి తొలిదశలో ఇంజక్షన్లతో సరిపోతుందని ఆయన తెలిపారు. చివరి దశలో మాత్రం తప్పనిసరిగా ఇంజక్షన్లు పనికి రావని శస్త్ర చికిత్సలే మార్గమన్నారు. చివరి వరకు మనిషి తన పని తాను చేసుకుంటూ బాత్‌రూంకు వెళ్లేందుకు కూడా ఒకరిపై ఆధారపడకుండా ఉండేలా చూసుకోవాలన్నారు.మోకాళ్ల అరుగుదలకు సంబంధించి చివరి దశలో ఇంజక్షన్లతో తగ్గదన్నారు. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని రోబోటిక్స్ సర్జరీల ద్వారా ఎంతో సులువుగా మోకాళ్ల శస్త్రచికిత్సలు నిర్వహించవచ్చునని తెలిపారు. గాటు తక్కువగా ఉండి నొప్పి తక్కువగా ఉంటుందని ఫిజియోథెరపి కూడా సులువవుతుందన్నారు. తాను వైద్య విద్యను గాంధీ మెడికల్ కళాశాలలో అభ్యసించానని, పదేళ్లు లండన్‌లో వైద్య శాస్త్రానికి సంబంధించి విద్యను అభ్యసించానని సునీల్ తెలిపారు. 2014లో భారత దేశానికి తిరిగి వచ్చి యశోద ఆసుపత్రిలో సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్‌గా పని చేస్తున్నానని తెలిపారు. ఇప్పటి వరకు తాను 15వేలకు పైగా ఆపరేషన్లు నిర్వహించానని అందులో 400లకు పైగా రోబోటిక్స్ సర్జరీలు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు మోకాళ్ల అరుగుదలకు సంబంధించి శస్త్ర చికిత్సలపై ఉన్న అపోహలు మానాలని కోరారు. మోకాళ్ల అరుగుదలకు సంబంధించి చివరి దశ శస్త్ర చికిత్స మాత్రమేనని దానికి మించిన వైద్యం మరొకటి లేదన్నారు.

# అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ మధిర :** అపరిచితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర టౌన్ ఎస్సై సంధ్య సూచించారు. ఇటీవల కాలంలో మధిర పట్టణంలో జరుగుతున్న వరుస దొంగతనాల నేపథ్యంలో టౌ న్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మైకు ప్రచారాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధిర పట్టణంలో గత కొన్నిరోజులుగా దొంగతనాలు జరుగుతున్నాయని, ప్రజలు అనుమానితులైన తారసపడితే వెంటనే 100కు సమాచారం అందించాలన్నారు. సామాజిక వ్యతిరేక కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దొంగతనాల నివారణకు పోలీస్‌శాఖ అన్ని రకాల చర్యలు తీసుకోవటం జరుగుతుందని, ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విధి నిర్వహణలో పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నీరు లేనిదే మానవుడు లేడు




**ప్రజాపక్షం/కల్లూరు:** నీరు లేనిదే మానవుడు లేడని ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నీటి ఆవశ్యకత పై వక్తలు జేవీఎస్ చంద్రశేఖర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదవతరగతి వరకు విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య సంపద అంతరించిపోవడం వలన పశుపక్షాదులు తోపాటు నీటిలో కప్పలు లేని కారణంగా డెంగ్యూ వ్యాధులు వస్తున్నాయని నీటిలో ప్లాస్టిక్ కాలుష్యం వలన జలం అంతరించిపోతుందని వివరించారు. నీటి వినియోగం పొదుపు గా వాడుకోవాలని పర్యావరణ పరిరక్షణ అనే అంశాల పైన కూలంకుషంగా పూర్తిగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు నివేదిత ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# బాల్య వివాహాలను అరికట్టాలి




**ప్రజాపక్షం/ బోనకల్ :** బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని తహశీల్దార్ పూర్ణచందర్ పేర్కొన్నారు.

స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎఫర్ట్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో క్రై సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన మండలస్థాయి బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్యవివాహాల నిషేద చట్టం 2006 ప్రకారం 21 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అబ్బాయిలు కాని, 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అమ్మాయిలకు కాని వివాహాలు జరిపించడం చట్ట విరుద్ధమని అన్నారు. ఎక్కడైనా బాల కార్మికులను గుర్తించినా, బాల్య వివాహాలు జరగుతున్నా 1098, 100నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. పిల్లల హక్కుల కోసం కృషి చేస్తున్న ఎఫర్ట్ సంస్థను అభినందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ పుల్లయ్య, మెడికల్ ఆఫీసర్ స్రవంతి, సూపరిండెంట్ నరేందర్, ఎఫర్ట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సురేష్, ప్రాజెక్టు సిబ్బంది, కమ్యూనిటీ మెంబర్లు పాల్గొన్నారు.

# గోటి తలంబ్రాలతో భద్రాచలంకు పాదయాత్ర

**ప్రజాపక్షం/కల్లూరు:** గోటితో వలచిన తలంబ్రాలతో శుక్రవారం ఉదయం కల్లూరు మండలం పుల్లయ్య బంజర గ్రామానికి చెందిన శ్రీరామ భక్తులు పాదయాత్రతో తరలి వెళ్లారు. పుల్లయ్య బంజరలోని రామాలయంలో ప్రత్యేక పూజలతో వందమంది మహిళలు, పురుషులు భక్తులు కలిసి పాదయాత్రతో తరలి వెళ్లారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ పాదయాత్రకు భద్రాచలంలోని శ్రీ రాముని పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలతో ముగించుకొని తిరిగి స్వగ్రామానికి చేరుకుంటామని భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురం శ్రీనివాస్, ఉప్పు సాంబశివరావు, బుర్రి వెంకట్ రాములుకిష్టం శెట్టి నరసింహారావు, వాసిని కిషోర్, నున్న నరసయ్య, వంగల శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు రైతులకు మేలు

**ప్రజాపక్షం/ చింతకాని :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులు నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలు రైతులకు మేలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయ అఖిల భారత సమన్వయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోరర్ధన్ రైతులకు సూచించారు. చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామంలో వరికి బదులు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు సాగుపై క్షేత్ర దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు. పంట మార్పిడి విధానం ఆరుతడి పంటల వల్ల రైతులు తక్కువ పెట్టుబడి ఖర్చుతో ఎక్కువ లాభం పొందవచ్చునన్నారు. జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగు వల్ల చీడపీడల నివారణతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఉమ్మారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రగతికుమారి, ఆర్ఇఇసి




సభ్యులు రాణా, ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు, ఎఓ పల్లెల నాగయ్య, పలు మండలాల వ్యవసాయశాఖ అధికారులు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

# ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ అరెస్ట్ సిగ్గుచేటు




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ను అరెస్ట్ చేయటం సిగ్గుచేటు అని ఆమ్ ఆద్మీ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు పసుమర్తి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ సీట్లు ను పెంచుకునేందుకు ప్రజాస్వామ్యం ను ఖూనీ చేస్తుందని అన్నారు. బీజేపీ తప్పుడు విధానాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రెండు నెలల కాలంలోనే ఇద్దరు ముఖ్యమంత్రులను అరెస్ట్ చేశారని అన్నారు. ఎన్నికలలో లబ్ధిపొందాలనే తపన తప్ప...ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటం లేదని అన్నారు. అక్రమ అరెస్ట్ ను నిరసిస్తూ అన్ని పార్టీలను కలుపుకుని దశల వారీగా పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. అక్రమ అరెస్ట్ ను ప్రజాస్వామ్య వాధులు ఖండించాలని కోరారు. దేశంలో ఇలాంటి ప్రభుత్వం చాలా ప్రమాదకరమని అన్నారు. వచ్చే ఎన్నికలలో ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలని సూచించారు.

# శాఖమూరి రమేష్‌పై రౌడీషీట్ రద్దు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ పై పెట్టిన రౌడీ షీట్‌ను రద్దు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నేలకొండపల్లి మండలం లోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ పై గత పాలకులు కక్ష పూరితంగా పలు కేసులు నమోదు చేయించారు. రౌడీ షీటర్ ను సవాల్ చేస్తూ హైకోర్టు ను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు పెట్టిన కేసులు అక్రమని తీర్పు ఇస్తూ ఆదేశాల జారీ చేశారు. వెంటనే రౌడీ షీటర్ తొలిగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఆయన మాట్లాడారు...గత పాలకులు బీఆర్ఎస్ నాయకులు తన పై కక్ష పూరితంగా అక్రమ కేసులు పెట్టారని అన్నారు. నియంత గా వ్యవహరించి రౌడీ షీటర్ నమోదు చేయించారన్నారు. గత అధికార పార్టీ నాయకులు అధికారం ను అడ్డుపెట్టుకుని ఆరాచకాలు చేశారని అన్నారు. అక్రమ కేసులు బనాయించారని అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్ నాయకులకు చెంప పెట్టు అన్నారు.

# మున్సిపల్ కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వాలి



**ప్రజాపక్షం/వైరా:** మున్సిపాల్ కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వకపోతే పస్తులుంటూ పనులు చేయాలంటూ సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, తెలంగాణ రాష్ట్ర మున్సిపాల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మందా వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా వైరా పురపాలక సంఘం కమీషనర్ చింతా వేణుకు సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపాల్ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపాల్ కార్మికులకు ఇచ్చేవే అంతంత మాత్రం వేతనాలు అని, అవి సక్రమంగా ఇవ్వకపోతే కార్మిక కుటుంబాలు పస్తులుంటూ పారిశుద్ధ్య పనులు చేయమంటారని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య రక్షణ పరికరాలు యూనిఫాం, సబ్బులు, నూనెలు, చెప్పులు ఇవ్వమని ఆదేశాలు ఉన్న వైరా పురపాలక సంఘం నందు అతీగతి లేదని తీవ్రంగా విమర్శించారు. ప్రతి నెలా వేతనాల నుండి కొంత శాతం ఈఎస్ఐ, పిఎఫ్ పేరుతో సొమ్ము మినహాయింపు చేస్తున్నారు. కాని కార్మికులకు ఈఎస్ఐ గుర్తింపు కార్డులు లేవన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు కార్మిక కుటుంబాల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. వైరా పురపాలక సంఘం నందు రోజురోజుకు జనాభా శాతం పెరుగుతుందని, అంతే పారిశుద్ధ్య సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. కాని కార్మికుల సంఖ్య నామమాత్రంగా ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. వైరా పురపాలక సంఘం పట్ల జిల్లా కలెక్టర్ దృష్టి సారించి కార్మికులకు ఎదుర్కొంటున్న వేతనాల సమస్యలు కార్మికుల పెంపుదల పరిష్కరించాలని కోరారు. పురపాలక సంఘం కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడం వలన కార్మికులు అధిక వడ్డీలకు డబ్బులు తీసుకొని కుటుంబాల పోషణ చక్కబెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపకపోతే రానున్న రోజుల్లో మున్సిపాల్ కార్మికుల పక్షాన సిపిఐ, ఏఐటియుసి ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి వైరా మండల కార్యదర్శి గారపాటి అశోక్, సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, నాయకులు కొండా రామకృష్ణ, దొబ్బల కృష్ణ, మూట కొండ, షేక్ షరీఫ్, ఏఐటియుసి మున్సిపాల్ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు రాపూడి శ్రీను, నాయకులు రాయపూడి రాజేష్, రాయపూడి కన్నయ్య, కోపెల కవిత, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి

## ఉమేష్ చంద్ర నగర్ కు తాగునీరు అందించిన ఎంపీఓ



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలో గల ఎనిమిది వలస ఆదివాసి గ్రామాలపై పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం పినపాక మండలం టి కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోగల ఉమేష్ చంద్ర నగర్ వలస ఆదివాసి గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకృష్ణతో కలిసి పర్యటించారు. గత 15 సంవత్సరాలుగా నెలకొని ఉన్న తాగునీటి సమస్యను తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు మడివి రమేష్ ద్వారా తెలుసుకున్న ఆయన ఆ ప్రాంతానికి అనేకమార్లు వెళ్లి వారికి తాగునీరు అందించారు. అక్కడ వారు స్వయంగా ఏర్పాటు చేసుకున్న బాలల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను స్వయంగా అందజేశారు. అంగన్‌వాడి నుండి పౌష్టికాహారం అందేలా చర్యలు చేపడతామని ప్రతి నెల అందేలా చూస్తామని తెలియజేశారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. కనీసం విద్యుత్ దీపాలు కూడా లేకపోవడంతో రెండు సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. బ్లీచింగ్ పనులు సైతం ప్రతిరోజు చేపడతామని హాయ్ నీ సందర్భంగా తెలియజేశారు. అనంతరం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మడివి రమేష్ మాట్లాడుతూ ఆదివాసీ సమస్యలపై స్పందించిన అధికారి ఇంతవరకు ఎవరూ లేరని సమస్య తెలపగానే తమ గ్రామాలకు వచ్చి సమస్యలు నేరుగా తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తున్నానని ఇటువంటి అధికారి మండలంలో పనిచేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. సుమారు 5 కిలోమీటర్లు నడిచి గ్రామాలు చేరుకొని సమస్యలు వింటున్న అధికారికి వారు కృతజ్ఞతలు తెలిపారు. పిట్టతోగు గ్రామంలో సైతం సమస్యను పరిష్కరిస్తామని ఎంపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు అశోక్, కృష్ణమూర్తి, గ్రామ పెద్ద రాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలి





**ప్రజాపక్షం/వైరా:** వైరాలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఖమ్మం పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు వాసిరెడ్డి రామనాధం, తెలుగు రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు కాపా కృష్ణమోహన్, రాష్ట్ర నాయకులు వెంకట రామారావు మాట్లాడుతూ పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఆ నిర్మాణం ప్రకారం ఖమ్మం పార్లమెంటరీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని, దాని కోసం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ ఇంచార్జి చెరుకూరి చలపతిరావు మాట్లాడుతూ ఆంధ్రుల ఆరాధ్యదైవం మహానీయుడు నందమూరి రామారావు అని అన్నారు. ఖమ్మంలో కేతినేని హరికృష్ణ గత 40 రోజులుగా ఎన్.రామారావుకి భారతరత్న ఇవ్వాలని, కార్డు ఉద్యమం చేపట్టి విజయవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. అందరికి పోస్టుకార్డులు సంతకాల సేకరణ చేపట్టడం జరిగిందని, కావున ఇటువంటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎన్‌టిఆర్‌కి భారతరత్న ప్రకటించాలని అన్నారు. తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి ప్రకటించే కార్యకర్తలను ఉద్దేశించి చేయాలని ఆవశ్యంగా అన్నారు. రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు, ఖమ్మ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ ఆంధ్రాలో ఎన్‌డిఏలో చేరిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒకచోట ఒక విధానాన్ని అవలంభించి మరోచోట వేరే పార్టీతో పోవడం విధానాన్ని ఆదరించడం కుదరదని కాబట్టి అందరి అభిమానం పార్టీ జాతి అధయక్షులతో చర్చించి తెలుగుదేశం పార్టీ నిర్ణయం మేరకు నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాలూరి అప్పారావు, కొండబాల కరుణాకర్‌రావు, కొనగంటి రామకృష్ణ, రామారావు, దామా శ్రీనివాసరావు, జూలురుపాడు మండల నాయకులు, వైరా మండల అధ్యక్షులు కిలారి సురేందర్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# యువతి ప్రేమకు నిరాకరిచండంతో.. ఆత్మహత్య చేసుకున్న యువకుడు



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** యువతి ప్రేమకు నిరాకరించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఎలుకల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామానికి చెందిన బత్తిని నిఖిల్(22), ఖమ్మం నగరానికి చెందిన ఓ యువతిని గతకొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. ఈ విషయాన్ని ఆ యువతి నిరాకరించడంతో ఈనెల 11న గ్రామ సమీపంలో ఎలకల మందు తాగి ఎలకలమందు డబ్బాతో ఇంటికి వచ్చాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే 108ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి న్యూలైఫ్ హాస్పిటల్‌కే అటు నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. గత 12రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి బత్తిని సుకన్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రాయల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా నియమించడం పట్ల మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ఖమ్మం రూరల్ మండలంలోని తనగంపాడు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు కేతినేని వేణు,వాల్యతండకు చెందిన ఆనంద్‌లు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

# నాయుడు సత్యనారాయణకు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/వైరా:** వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ లీడర్ తెలంగాణ రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణను యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొప్పురావూరి శబరినాథ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయుడు సత్యనారాయణకు కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పురావూరి శబరినాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు వస్తాయని అన్నారు.

# మద్యం సీజ్



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని లింగాల ,పెద్ద కోరుకొండి, గ్రామాలలో బెల్ట్ షాపులలో ఫ్లయింగ్ స్క్వాడ్ శుక్రవారం దాడులు నిర్వహించి రూ 16 వేలు విలువ చేసే మద్యం సేసాలను స్వాధీనం చేసుకొని సత్తుపల్లి ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ సత్తుపల్లి నియోజకవర్గ అధికారి ప్రభాకర్ రావు తెలిపారు. అనధికారికంగా మద్యం నిల్వలు ఉంచినట్లయితే ఎలాంటి వారినైనా వదిలేయలేదు లేదని దుకాణాలలో అనుమతి లేని మద్యం, నగదు, బహుమతులు పంపిణీకి వస్తువులు సిద్ధంగా ఉంచినట్లయితే సమాచారం తెలిస్తే తప్పనిసరిగా సీజ్ చేస్తానని ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసి కేసులు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్లూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కవిత నిందితురాలు కాదు బాధితురాలు : వద్దిరాజు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎంఎల్‌సి కవిత నిందితురాలు కాదు బాధితురాలని కావాలనే ఎన్నికల ముంగిట కవితపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. చాలా కాలం నుంచి సాగదీసి ఎన్నికల వేళ తెరపైకి తెచ్చిన ఈడిని ఆయన తప్పుపట్టారు. ఈడి రాజకీయంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఖమ్మం పార్లమెంటు సభ్యులు నామ నాగేశ్వరరావు, కెఆర్ సురేష్‌రెడ్డి, ఎం. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ఢిల్లీలో వద్దిరాజు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వద్దిరాజు మాట్లాడుతూ 2004

## ప్రస్తుత పార్టీలోనే కొనసాగుతా : నామ

నుండి 2014 వరకు కేవలం 200 కేసులు నమోదైతే 2014 నుండి 2024 వరకు 2,954 కేసులు నమోదు చేశారని ఆయన తెలిపారు. ఈ కేసుతో కవితకు ఎటువంటి సంబంధం లేదని వద్దిరాజు తెలిపారు. న్యాయ వ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉందని ధర్మం తప్పక గెలుస్తుందని కడిగిన ముత్యంలా ఆమె బయటకు వస్తారని ఆయన తెలిపారు. ఖమ్మం ఎంపి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ పార్టీ నాయకురాలు కవితపై పెట్టిన లిక్కర్ కేసు అక్రమమన్నారు. ప్రభుత్వ పాలసీ ప్రకారమే లిక్కర్ వ్యాపారం జరిగిందని ఆ కేసులో కవితకు ఎటువంటి సంబంధం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన పాలసీలలో మైనింగ్, రోడ్లు, ఎయిర్‌వేస్ ఉన్నాయి. ప్రజల అవసరాల దృష్ట్యా కొన్ని పాలసీలను రూపొందిస్తారని ఆయన తెలిపారు. న్యాయస్థానాలపై నమ్మకం ఉందని తెలిపిన నామ ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ ప్రస్తుతం తాను ఏ పార్టీలో ఉన్నానో అదే పార్టీలో కొనసాగుతానని సమాధానం ఇచ్చారు. నామ పార్టీ మారుతున్నారని, బిజెపిలో చేరుతున్నారని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కూలర్ వితరణ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పట్టమ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో స్థానిక గ్రంధాలయ సంస్థకు ఎయిర్ కూలర్‌ను వితరణగా ఇచ్చారు. దోసపాటి రాము ఉష దంపతుల వివాహన వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వితరణ చేసినట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జూలారి ఆనంద్ మాట్లాడుతూ ఎస్‌కేటి వారి సౌజన్యంతోఈ వితరణ చేసినట్లు చెప్పారు. ఆర్యవైశ్య మహాసభ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ సేవలను మరింత విస్తరించి పలువురికి చేయూత నిందించనున్నట్లు చెప్పారు. వేసివ కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమంలో గ్రంధపాలకురాళ్లు డి వరలక్ష్మి దేవి, జి మణిమృధుల, గునిపాటి సుధాకర్, ధర రమేష్, కొద్దిమూరి సురేష్, మెడ గణేష్, కోయాడ నగేష్, కొదుమూరి సత్యనారాయణ, నరేంద్ర, రుషి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మన ఇసుక వాహనం ద్వారా ఇసుకను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మన ఇసుక వాహనం ద్వారా ఇసుక ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బూర్గంపాడు మండల తహసీల్దార్ ముజాహీద్ద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రలోని బూర్గంపాడు గ్రామ పంచాయితీ పరిధిలో మన ఇసుక మన వాహనం ద్వారా ఇసుక ఆన్‌లైన్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇసుక పాలసీ విధానం వల్ల ఇసుక ఇక నుంచి చౌర ధరకు ఇసుక లభించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వార ఇసుక విక్రయాలు నిర్వహించేందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వార ఆధునాతన సాఫ్ట్‌వేర్‌ను రూపొదించినట్లు తెలిపారు. ప్రస్తుతం బూర్గంపాడు గ్రామంలో ఇసుక రీచ్ ద్వారా ఇసుక లభ్యమవుతుందని తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే ఆయా రీచ్‌లలో ఇసుక రవాణా చేసేందుకు అవకాశం ఉందన్నారు. నిర్దేశించిన సమయంలో కాకుండా ఇతర సమయాలలో ఇసుక రవాణా చేసేందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇసుక రీచ్‌ల వద్ద ప్రభుత్వం నుంచి ఉద్యోగులను ఉంచనున్నట్లు తెలిపారు. శ్యాండ్ టాక్స్ విధానంలో ఎక్కడి నుంచైనా ఇసుక తరలించేందుకు ట్రాక్టర్ యజమానులు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రంమే అవకాశం ఉంటుందని, ఇసుక కావాలని రిజిస్ట్రేషన్ చేయించుకున్న



వ్యక్తికి , ట్రాక్టర్ యజమానికి, డ్రైవర్ సెల్‌కు మేసెజ్ చేరడంతో పాటు ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ జీపీఆర్ఎస్ విధానాన్ని అనుసంధానం చేయడం ద్వార ఇసుక రవాణ చేసే ట్రాక్టర్ ఎక్కడ ఉందో స్పష్టంగా తెలుసుకునేందుకు విలు ఉంటుందని అన్నారు. ఇసుక రవాణాకు సంబంధించి చెల్లింపులు ఆన్‌లైన్ విధానం ద్వారానే జరుగుతాయని , నేరుగా చెల్లింపులు లేదన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐలు ముత్తయ్య, నర్సింహారావు, ఎస్ఆర్‌వో రామ్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు భజన ప్రసాద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/కరకగూడెం:** పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈవిషయంపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కలవల నాగారం గ్రామానికి చెందిన శోభన్(36) అనే వ్యక్తితో అశ్వాపురం సమీపంలోని తండాకు చెందిన యువతితో వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నారు. నాలుగు నెలల క్రితం తన భార్యతో వివాదం అయిందని, ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోయి తన భర్త దగ్గరకు అప్పటి నుంచి రాలేదు. తన భార్య తన దగ్గరికి రావడం లేదని మనస్థాపం చెంది గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ఆ వ్యక్తిని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి శుక్రవారం మృతి చెందారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

# హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా రాయల సీతయ్య



**ప్రజాపక్షం/కామేపల్లి:** హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా జాస్తిపల్లి గ్రామానికి చెందిన రాయల సీతయ్యను ఎన్నిక చేస్తూ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉన్నాం జ్ఞానసుందరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

# కామేపల్లి సొసైటీ వైస్ చైర్మన్‌గా రాంబాబు



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి సొసైటీ వైస్ చైర్మన్‌గా పింజర మడుగు గ్రామానికి చెందిన గుజ్జర్లపూడి రాంబాబును శుక్రవారం ఏకగ్రీవంగా డైరెక్టర్లు ఎన్నుకున్నారు. గతంలో ఛైర్మన్‌గా ఉన్న తీర్థాల చిదంబరరావుపై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. కాగా అప్పటి వైస్ ఛైర్మన్‌గా ఉన్న కాట్రాల రోశయ్యను తాత్కాలిక ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పటించారు. అయితే డైరెక్టర్లు రోశయ్యపై కూడా అవిశ్వాసం పెట్టారు. దీంతో 11 మంది డైరెక్టర్లు రోశయ్యపై కూడా అవిశ్వాసం పెట్టారు. దీంతో 11 మంది డైరెకకటర్‌లతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సిహెచ్ రవికుమార్ 20 వ తేదీన కామేపల్లి సొసైటీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి లాటరీ పద్దతిలో దొంగల వెంకటనర్సమ్మను తాత్కాలిక వైస్ ఛైర్మన్, ఛైర్మన్‌గా ఎన్నిక చేస్తూ బాధ్యతలు అప్పగించారు. అయితే వైస్ ఛైర్మన్‌ను నియమించాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో 11 మంది డైరెక్టర్‌లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వైస్ ఛైర్మన్‌గా రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే ఛైర్మన్‌ను ఎన్నిక చేసే వరకు తాత్కాలిక ఛైర్మన్‌గా రాంబాబు కొనసాగుతారని అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికుమార్ పేర్కొన్నారు. రాంబాబు వైస్ ఛైర్మన్‌గా ఎన్నిక కావడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నర్సింహారెడ్డి, ఎంపిటిసి నల్లమోతు లక్ష్మయ్య, జిల్లా నాయకులు ఏపూరి మహేందర్ కుమార్, దమ్మలపాటి సత్యనారాయణ, పుచ్చకాయల వీరభద్రం, ఎస్‌కె షత్తే అహ్మద్, నల్లమోతు వెంకటనర్సయ్య, వరికొల్లు సైదులు, మాలోత్ బావ్ సింగ్, ప్రేమ్, తుమ్మలపల్లి వీరయ్య, బత్తుల నాగరాజు, దొడ్డ వేణు, సిఈవో జి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చెన్నకేశవస్వామి బ్రహోత్సవాలు ప్రారంభం



**ప్రజాపక్షం/ చింతకాని :** చింతకాని చెన్నకేశవ స్వామి బ్రహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయని ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. ఫాల్గుణశుద్ధ పౌర్ణమి సోమవారం రాత్రి 8గంటలకు శ్రీ భూనీలా సమేత చెన్నకేశవ స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం జరుగుతుందని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ ప్రధానార్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు కోరారు.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ప్రజాపక్షం/ చింతకాని :** చిన్నమండవ మున్నేటి నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పందిళ్ళపల్లి సమీపంలో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగల్‌మీరా తెలిపారు.

# వైరా మున్సిపాలిటీలో ఇంటి పన్నుల వసూళ్ల పరిశీలన

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో ఇంటి పన్నుల వసూళ్లను శుక్రవారం వైరా మున్సిపాల్ కమీషనర్ సిహెచ్.వేణు పరిశీలించారు. వార్డుల్లోకి వెళ్లి ఇంటి పన్నులు వసూలు చేస్తున్న విధానాన్ని పరిశీలించిన కమీషనర్ ఈ నెల31లోపు పూర్తిస్థాయిలో ఇంటి పన్నులు వసూలు చేయాలని, రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజల్లో అవగాహన వచ్చే విధంగా చూడాలని ఆయన వార్డు అధికారులతో అన్నారు. అదేవిధంగా ప్రజలు రాయితీని సద్వినియోగం చేసుకొని మున్సిపాలిటీకి ఇంటి పన్నును చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కమీషనర్ వేణు అన్నారు. ఇంటి పన్నులు వసూలుకు వెళ్లినప్పుడు మున్సిపాల్ సిబ్బంది ప్రజల పట్ల స్నేహపూర్వకంగా ఉండి వారిలో మమేకం కావాలని అన్నారు. ప్రతి వార్డు ఆఫీసర్ వార్డులో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించి పన్నులు వసూలు



చేయడంలో ముందుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు అధికారులు పాల్గొన్నారు.

# సాగర్ జలాలను వైరా రిజర్వాయర్‌కు విడుదల చేయాలి : యామాల

**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఎండిపోవడం ఇది మొదటిసారి అని వైరా మండలంలో వైరా రిజర్వాయర్ క్రింద మొక్కజొన్న వరి ఇతర పంటలు వేసి పంట చేతికచ్చే సమయానికి వైరా రిజర్వాయర్ నీటిమట్టం పూర్తిగా అట్టడుగు స్థాయికి చేరుకుందని వైరా రిజర్వాయర్ ఆయకట్టు క్రింద ఉన్న వాగులు, కుంటలు, బోర్లు, చెక్ డ్యామ్‌లు పూర్తిగా ఎండిపోయి గ్రామాల్లో పొలానికి వెళ్లిన పశువులు, మనుషులు కనీసం త్రాగడానికి కూడా నీరు లేక విలవిలలాడుతంది. సాగర్ నీరు వైరా రిజర్వాయర్‌కు విడుదల చేసి పశువులను అలాగే పంటలను కాపాడాలని సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు.